క్లుప్తంగా

ఎస్సెస్సీ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు



విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలోని ఆయా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎస్సెస్సీ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. త్వరలో ప్రారంభం కానున్న ఎస్సెస్సీ పరీక్షలకు విద్యార్థులను ఉపాధ్యాయులు సన్నద్ధం చేస్తున్నారు. ఆయా పాఠ్యాంశాలకు సంబంధించి రివ్యూలు, పరీక్షలను నిర్వహిస్తున్నారు. ఆయా పాఠశాలలను ఎంఈఓ వెంకటేశం పరిశీలించి ఉపాధ్యాయులకు, విద్యార్థులకు సూచనలందించారు. కష్టపడి చదివి పాఠశాలకు పేరు తీసుకొని రావాలన్నారు.

కౌడిపల్లి ఇన్‌చార్జి పశువైద్య అధికారిగా ఫర్హీన్‌ఫాతిమా



కౌడిపల్లి(నర్సాపూర్): మండల ఇన్‌చార్జి పశువైద్యాధికారిగా ఫర్హీన్‌ఫాతిమా శనివారం నియామకమయ్యారు. ఇక్కడ విధులు నిర్వహించిన డాక్టర్ రాజు బదిలీపై అల్లాదుర్గం వెళ్లారు. కాగా చేగుంట మండల పశువైద్యాధికారి ఫర్హీన్ ఫాతిమా ఇక్కడ ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించారు. పశువుల వ్యాధులపై రైతులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

అర్హులకు సంక్షేమ పథకాలు



అల్లాదుర్గంలో సర్వేను పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి కరుణాకర్

అల్లాదుర్గం(మెదక్): అర్హులైన ప్రతీ ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు సర్వే చేపడుతున్నట్లు మండల ప్రత్యేకాధికారి కరుణాకర్ చెప్పారు. శనివారం అల్లాదుర్గంలో రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయభరోసా తదితర పథకాలపై చేపడుతున్న సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం చేపడుతున్న సర్వేను పకడ్బందీగా చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, తహసీల్దార్ మల్లయ్య తదితరులు ఉన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ పోచయ్య

రేగోడ్(మెదక్): మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ పోచయ్య హెచ్చరించారు. మండలంలోని పోచారం గ్రామ రహదారిపై శనివారం వాహనాలను తనిఖీ చేశారు. అనంతరం ప్రజలకు సైబర్ ఆన్‌లైన్ అరెస్ట్‌లపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనాల వెంట అన్ని ధ్రువపత్రాలు ఉంచుకోవాలని తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేస్తే నమ్మకూడదని సూచించారు.

అంజన్నకు భక్తుల పూజలు



ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

శివ్వంపేట(నర్సాపూర్): ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన చిన్నగొట్టిముక్ల చాకరిమెట్ల అరణ్యంలో కొలువైన శ్రీ సహకార ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం భక్తజన సందడి నెలకొంది. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం సత్యనారాయణస్వామి మండపంలో భక్తులు సామూహిక వ్రతాలు ఆచరించారు. భక్తులకు ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఫౌండర్, చైర్మన్ ఆంజనేయశర్మ, ఈఓ శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకుడు దేవాదత్తశర్మ, ప్రభుశర్మ, దేవిశ్రీ, శ్రీవాత్సవ్‌శర్మ తదితరులు ఉన్నారు.

ప్రశాంతంగా ప్రవేశ పరీక్ష



నర్సాపూర్‌లోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

పట్టణంలో నిర్వహించిన నవోదయ ప్రవేశ పరీక్ష శనివారం ప్రశాంతంగా ముగిసింది. పట్టణంలో రెండు సెంటర్లు ఏర్పాటు చేశారు. పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సెంటర్‌లో 216 మంది పరీక్ష రాయాల్సి ఉండగా, 158 మంది హాజరవ్వగా 58 మంది గైర్హాజరయ్యారు. విష్ణు హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన సెంటరులో 173 మందికి 101 మంది పరీక్ష రాయగా, 72 మంది గైర్హాజరయ్యారు.

– నర్సాపూర్

కమ్మేసిన పొగ మంచు



శివ్వంపేట లో కమ్మేసిన పొగమంచు

మండల కేంద్రం శివ్వంపేటతో పాటు పలు గ్రామాల్లో శనివారం పొగమంచు కమ్మేసింది. ఉదయం 9 గంటల వరకు పొగమంచు రావడంతో వృద్ధులు, చిన్నారులతో పాటు విద్యాలయాలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తూప్రాన్– నర్సాపూర్ హైవే పొగమంచుతో నిండిపోవడంతో వాహనదారులు లైట్లు వేసుకుని నెమ్మదిగా వెళ్లాల్సి వచ్చింది.

– శివ్వంపేట(నర్సాపూర్):

8వ రోజుకు చేరిన దీక్షలు

నిజాంపేట(మెదక్): మండల కేంద్రం నుంచి నస్కల్, చల్మెడ గ్రామాలకు వెళ్లే తారురోడ్డును మరమ్మతు చేయించాలని డిమాండ్ చేస్తూ ఆయా గ్రామాల ప్రజలు చేస్తున్న దీక్షలు శనివారం నాటికి ఎనిమిదో రోజుకు చేరుకుంది. ఈ విషయమై ప్రభుత్వం ఎంత మాత్రం పట్టించుకోవడం లేదని దీక్షలో ఉన్న వారు ఆరోపించారు. గత ఏడాది కాలంగా కంకర పరిచిన రోడ్డుపై ప్రయాణాలు చేయలేక తాము ఇబ్బందుల పాలవుతున్నామని వారు వాపోయారు. ఇకనైనా మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ స్పందించాలని వారు విజ్ఞప్తి చేశారు.



కొనసాగుతున్న దీక్షలు

నేటి నుంచి చాముండేశ్వరీ ఉత్సవాలు

- మెదక్ జిల్లా చిలప్‌చెడ్ మండలం చిట్కుల్ సమీపంలో ఆలయం
- దక్షిణ భారతదేశంలో రెండో అతి పెద్ద ఆలయంగా కీర్తి
- 9 అడుగుల ఎత్తు, 18 చేతులు జ్వాలా కిరీటంతో ఏక శిలా విగ్రహం



చిట్కుల్ సమీపంలోని చాముండేశ్వరీ ఆలయం

చిలప్‌చెడ్(నర్సాపూర్): భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతోంది చాముండేశ్వరీ అమ్మవారు. మెదక్ జిల్లా చిలప్‌చెడ్ మండలం చిట్కుల్ గ్రామ సమీపంలో మంజీరా తీరాన పచ్చటి పొలాల మధ్యన ఈ ఆలయం వెలసింది. దక్షిణ భారతదేశంలో రెండో అతిపెద్ద ఆలయంగా ప్రసిద్ధి చెందింది. ఆలయంలో చాముండేశ్వరీ అమ్మవారు శక్తి స్వరూపిణిగా, తొమ్మిది అడుగుల ఎత్తు, పద్దెనిమిది చేతులతో జ్వాలా కిరీటం ధరించి భక్తులకు దర్శనమిస్తోంది. ఆదివారం నుంచి మంగళవారం వరకు చాముండేశ్వరీ అమ్మవారి 42 వ వార్షిక ఉత్సవాలు వైభవంగా జరుగుతాయి.

విగ్రహం ప్రత్యేకత

కరీంనగర్ జిల్లా ధర్మపురి నుంచి శిలలను తెప్పించి తమిళ శిల్పులతో చాముండేశ్వరీ అమ్మవారి విగ్రహన్ని చెక్కించారు. 9 అడుగుల ఎత్తు, 18 చేతులు, ముఖ్యంగా అమ్మవారికి జ్వాలా కిరీటం ప్రత్యేక ఆకర్షణగా మలిచారు. గర్భగుడిలో విగ్రహనికి ఒక వైపు మహిషాసురుడు, మరోవైపు సింహం ఉంటుంది.



గర్భగుడిలో కొలువైన అమ్మవారు

ఆలయ గోపురం ఎత్తు 85 అడుగులు ఉంటుంది. ప్రస్తుతం ఆలయం ఎదుట రాజగోపురం, ఇరువైపుల గాలి గోపురాల నిర్మాణాలు పూర్తయ్యాయి.

ఏటా రెండు సార్లు ఉత్సవాలు

అమ్మవారి ఆలయంలో ఏటా రెండు సార్లు ఉత్సవాలు నిర్వహిస్తారు. ఆశ్వాయుజ మాసంలో దేవి నవరాత్రులతో పాటు, పుష్యబహుళ పంచమి నుంచి సప్తమి వరకు ఆలయ వార్షికోత్సవాలు ఘనంగా జరుగుతాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు భక్తులు మంజీరా నది స్నానం చేసి, కళశాలతో నీటిని తీసుకొచ్చి అమ్మవారికి అభిషేకం చేస్తారు. దీంతో పాటు పంచామృతాభిషేకం నిర్వహిస్తారు. కుంకుమార్చన సాక్షాత్తు అమ్మవారి పాదాలపై జరగడం విశేషం.

ఆలయానికి చేరిక ఇలా..

హైదరాబాద్ నుంచి సంగారెడ్డి, జోగిపేట మీదుగా చాముండేశ్వరీ ఆలయాన్ని చేరుకోవచ్చు. మెదక్ వైపు నుంచి జోగిపేట మార్గం, నర్సాపూర్ నుంచి జోగిపేటకు వెళ్లే మార్గం ద్వారా ఆలయాన్ని చేరుకోవచ్చు.

దరఖాస్తుల ఆహ్వానం

వెల్దుర్తి(తూప్రాన్): వెల్దుర్తి కేజీబీవీ పాఠశాలలో ఖాళీగా ఉన్న హిందీ పోస్టుకు గెస్ట్ టీచర్‌గా నియామకం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ఎస్‌ఓ ఫాతిమా అన్నారు. హిందీలో పట్టభద్రులు, కనీసం ఒక సంవత్సరం హిందీ బోధనలో అనుభవం కలిగి ఉండి ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 23వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇతర వివరాలకు ఫోన్ నం. 77020 76136ను సంప్రదించాలని సూచించారు.

ఇందిర మహిళాశక్తితో చేయూత

చిన్నశంకరంపేట(మెదక్): మహిళా సంఘాల సభ్యులకు చేయూతనిచ్చేందుకే ఇందిర మహిళా శక్తి పథకం అమలు చేస్తున్నట్లు డీఆర్‌డీఏ అడిషనల్ పీడీ సరస్వతి తెలిపారు. శనివారం చిన్నశంకరం పేట ఐకేపీ కార్యాయలంలో మహిళా సంఘాల వీఓలు, సీసీల సమావేశంలో మాట్లాడుతూ.. మహిళా శక్తి పథకం లబ్ధిదారుల ఎంపికను వేగవంతం చేయాలన్నారు. స్త్రీనిధి రుణాలు, బ్యాంకు రుణాలను లక్ష్యం చేరుకునేలా కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో డీపీఎం వెంకట్, ఐకేపీ ఏపీఓ లక్ష్మీనారాయణ, సీసీలు యశోద, రాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ అడిషనల్ పీడీ

మండల అభివృద్ధికి నిధులివ్వండి



మంత్రి కొండా సురేఖకు వినతిపత్రం అందిస్తున్న నార్సింగి మండల కాంగ్రెస్ నాయకులు

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల అభివృద్ధికి నిధులు అందించాలని రాష్ట్ర మంత్రి కొండా సురేఖకు కాంగ్రెస్ నాయకులు వినతిపత్రం అందించారు. శనివారం చేగుంట మండలం వడియారంలో నార్సింగి, చేగుంట మండలాల కల్యాణలక్ష్మి చెక్కులను అందించేందుకు వచ్చిన మంత్రిని కాంగ్రెస్ నాయకులు కలిశారు. కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్, బాల్‌రాజ్‌గౌడ్‌లు కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నార్సింగి నూతన మండల కేంద్రంలో ఎంపీపీ, తహసీల్దార్ కార్యాయలం, మోడల్‌స్కూల్, పోలీస్‌స్టేషన్ భవన నిర్మాణానికి నిధులు అందించాలని కోరారు. నార్సింగి మండల అభివృద్ధికి సహకరించాలన్నారు.

కొనసాగుతున్న శీతలమాత జాతర



బోనాలతో భక్తులు

నర్సాపూర్: పట్టణంలోని శీతలమాత ఆలయ నవమ వార్షికోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. శనివారం ఆలయ అర్చకులు హరికృష్ణ శర్మ, హరిప్రసాద్‌శర్మల ఆధ్వర్యంలో పూజలు చేశారు. అభిషేకం అనంతరం చండీయాగం నిర్వహించారు. ఇందులో భాగంగా భక్తులు బోనాలను ఊరేగించి, ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి బోనాలు సమర్పించారు.

కడీలను ధ్వంసం చేసిన వారిపై చర్యలు



మండలంలోని కామారం శివారులో జేసీబీతో సాయంతో ధ్వంసం చేస్తున్న కడీలు

చిన్నశంకరంపేట(మెదక్): తన పంట పొలంలోకి ప్రవేశించి పొలం వద్ద ఏర్పాటు చేసిన కడీలను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని మండలంలోని గవ్వలపల్లి గ్రామానికి చెందిన గణేశ్ పోలీస్‌లకు ఫిర్యాదు చేశాడు. శుక్రవారం మండలంలోని కామారం శివారులో ఉన్న పంట పొలం వద్దకు మెదక్‌కు చెందిన టీచర్ నరేందర్‌రెడ్డి మరి కొందరితో పొలం వద్ద ఏర్పాటు చేసిన కడీలను ధ్వంసం చేసినట్లు తెలిపారు. మెదక్‌లో నివాసం ఉండే లింగమూర్తికి, నరేందర్‌రెడ్డికి మధ్య ఉన్న వివాదం నేపథ్యంలో ఈ దాడి జరిగినట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదుతో నరేందర్‌రెడ్డితో పాటు మరి కొందరిపై పోలీస్‌లు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

కొనసాగుతున్న సర్వే

పెద్దశంకరంపేట(మెదక్): ప్రభుత్వం ఈ నెల 26 నుంచి ప్రారంభించనున్న పథకాలకు సంబంధించిన సర్వే మండలంలో కొనసాగుతోంది. శనివారం మండల పరిధిలోని కమలాపూర్, మక్తలక్ష్మాపూర్, కోళాపల్లి, రామోజీపల్లి, నారాయణపల్లి తదితర గ్రామాల్లో నిర్వహిస్తున్న సర్వేను తహసీల్దార్ గ్రేస్ బాయి, ఎంపీడీఓ రఫీఖ్‌ఉన్నీసాలు పరిశీలించి అధికారులకు సూచనలందించారు. సర్వేను పకడ్బందీగా చేపట్టాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు, ఎంపీఓ, ఏఈఓలు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.



కమలాపూర్‌లో సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్

రాజ్యాంగాన్ని పరిరక్షించాలి

డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్



మాట్లాడుతున్న శంకర్

రామాయంపేట(మెదక్): మన రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి శంకర్ సూచించారు. శనివారం రామాయంపేటలో జరిగిన రాజ్యాంగ పరిరక్షణ సదస్సులో ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగంలోని సమానత్వం, స్వేచ్ఛ, సోదరభావాన్ని కొందరు జీర్ణించుకోలేకపోతున్నారని ఆరోపించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పొందడం మన హక్కని, అర్హులైన కుటుంబాలకు వైట్ రేషన్ కార్డులు అందజేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పనులకు సంబంధించి కూలీలకు సకాలంలో, సక్రమంగా డబ్బులు అందకపోవడంతో వారు పనులపై విముఖత వ్యక్తం చేస్తున్నారన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు సంజీవ్, కార్యదర్శులు నర్సింలు, దయాసాగర్, తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో ఎంతోమేలు

మండల వ్యవసాయాధికారి రామ్‌శివరావు

వెల్దుర్తి(తూప్రాన్): వ్యవసాయంలో భూసార పరీక్షలు ఎంతో కీలకమైనవి. నేల స్వభావం, లవణ పరిమాణంతో పాటు సూక్ష్మ, స్థూల పోషకాలు ఏ స్థాయిలో ఉన్నాయో, ఆ భూమి ఏయే పంటల సాగుకు అనుకూలమో ఈ పరీక్షల వల్ల తెలుస్తుంది. రైతులకు అందజేసే కార్డుపై ఈ వివరాలతో పాటు పంటలకు ఏ మోతాదులో ఎరువులు వేయాలో సూచిస్తారు. ఒక్కసారి భూసార పరీక్షలు చేయించుకుంటే ఆ ఫలితాల ఆధారంగా రెండు, మూడేళ్ల పంటలు సాగుచేసుకోవచ్చు.

పంటలు లేని కాలంలోనే..

పంటలు లేనప్పుడే మట్టిని సేకరించాలి. ఏడాదికి ఒక పంట పండించే రైతులు ఫిబ్రవరి, ఏప్రిల్ మధ్య కాలంలో, రెండు పంటలు పండించే రైతులు మే నెలలో నమూనాలు సేకరించాలన్నారు. నేల రకం, రంగు, సాగు నీటి వసతి, మిట్ట, పల్లం, సేద్య పద్ధతుల ఆధారంగా వేర్వేరు నమూనాలు తీసుకోవాలన్నారు. పొలమంతా ఒకే రకంగా ఉంటే ఐదెకరాల విస్తీర్ణానికి ఒకే మట్టి నమూనా తీస్తే సరిపోతుందని, మట్టి నమూనా తీసే ప్రదేశంలో నేలపై చెత్తా, చెదారం ఉండొద్దని తెలిపారు. పారతో ఆంగ్ల అక్షరం వీ ఆకారంలో 15, 24 సెంటీమీటర్ల గుంత తవ్వి, పై నుంచి దిగువకు ఒకే మందంలో పలుచని పొరవచ్చేలా మట్టి తీయాలని, ఇలా ఒకటి నుంచి 12 చోట్ల మట్టిని సేకరించాలన్నారు. అన్నిచోట్ల సేకరించిన మట్టిని గోనె పట్టా లేదా పాలిథీన్ షీట్ లేదా వస్త్రం మీద పోసి చిదమాలని. మట్టిని చతురస్రాకారంగా పరిచి, నాలుగు భాగాలుగా విభజించాలన్నారు. వీటిలో ఒకటి, మూడు భాగాలు ఉంచుకొని రెండు, నాలుగు భాగాల్లో మట్టిని తొలగించాలన్నారు. ఈ విధంగా నాలుగైదు సార్లు చేసి చివరకు 500 గ్రాముల మట్టి నమూనాను ప్లాస్టిక్ సంచిలో నింపాలని దాంతో పాటు నమూనా వివరాలను తెలిపే పత్రాన్ని వివరాలతో పాటు పరీక్షా కేంద్రానికి పంపాలని సూచించారు.



మట్టి నమూనాలు సేకరిస్తున్న అధికారులు(ఫైల్)

మట్టి సేకరణలో జాగ్రత్తలు తప్పనిసరి



చెట్ల కింద, గట్ల పక్కన, కంచెల దగ్గర నమూనాలను సేకరించొద్దు. పేడ, ఇతర ఎరువులు వేసిన చోట, రసాయన ఎరువులు వేసిన నెల రోజుల వరకు నమూనాలను సేకరించొద్దు. అదేవిధంగా నీరు నిలిచి బురద ఉన్న నేలల నుంచి నమూనాలను తీయ్యొద్దు. మంచి పొలంలో మట్టిని, చెడు పొలంలోని తీసిన మట్టితో కలుపరాదు. సేకరించిన మట్టి నమూనాలను జిల్లా కేంద్రంలోని కేంద్రానికి పరీక్షలకు పంపాలి. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– రామ్‌శివరావు, మండల వ్యవసాయాధికారి, మాసాయిపేట

సంక్షిప్త వార్తలు

◆ రిలే నిరాహార దీక్షలు జయప్రదం చేయండి

వెల్దుర్తి(తూప్రాన్): ఆర్టిజన్ కార్మికులను కన్వర్షన్ చేయాలనే డిమాండ్‌తో ఈ నెల 20 నుంచి 24 వరకు నిర్వహించ తలపెట్టిన రిలే నిరాహార దీక్షలను కార్మికులు జయప్రదం చేయాలని టీవీఏసీ జేఏసీ సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ నాగరాజు పిలుపునిచ్చారు. ఈ మేరకు వెల్దుర్తిలో ఆయన మాట్లాడుతూ.. డిమాండ్ల సాధన కోసం టీవీఏసీ జేఏసీ పిలుపుమేరకు మెదక్ ఎస్‌ఈ కార్యాలయం ఎదుట ఈ నెల 20 నుంచి రిలే నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు తెలిపారు. జిల్లాలోని ఆర్టిజన్ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలన్నారు.

◆ వీరహనుమాన్ ఆలయంలో పూజలు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్నలోని బాల వీరహనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు అన్నదానం చేశారు. శనివారం ఆలయ అర్చకులు మెట్టురాములు బాల వీరహనుమాన్‌కు పంచామృతాలతో అభిషేకం చేసి, చందనం అలంకరించారు. అనంతరం శివలింగానికి దేవతామూర్తుల విగ్రహాలకు అభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

◆ బ్యాటరీ చోరీ

శివ్వంపేట(నర్సాపూర్): కేజీవీల్ ట్రాక్టర్ నుంచి బ్యాటరీ చోరీ చేసిన సంఘటన మండల పరిధిలోని ఎదుల్లాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పైనం రాములు తన కేజీవీల్ ట్రాక్టర్ దున్నకం అనంతరం శుక్రవారం సాయత్రం గ్రామ శివారులోని పశువుల పాక వద్ద నిలిపాడు. గుర్తుతెలియని వ్యక్తులు అర్ధరాత్రి ట్రాక్టర్ నుంచి బ్యాటరీని దొంగలించారు. శనివారం ఉదయం దున్నకం కోసం ట్రాక్టర్ వద్దకు వెళ్లిన రాములు బ్యాటరీ చోరీ అయినట్లు గుర్తించాడు.

◆ కోతుల దాడిలో వ్యక్తికి గాయాలు



బుచ్చయ్య

చిలప్‌చెడ్(నర్సాపూర్): కోతుల దాడిలో వ్యక్తికి గాయాలైన సంఘటన చిలప్‌చెడ్ మండలం ఫైజాబాద్ గ్రామంలో శనివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ఫైజాబాద్ గ్రామానికి చెందిన వంజరి బుచ్చయ్య పాలు పితకడానికి పశువుల పాకకు వెళ్లగా, అక్కడే ఉన్న కోతుల గుంపు అతనిపై దాడి చేశాయి. ఈ దాడిలో అతని చేతులకు గాయాలయ్యాయి. ఈ విషయాన్ని గమనించిన ఇరుగు, పొరుగు వారు కోతులను తరిమికొట్టడంతో, బుచ్చయ్యకు ప్రమాదం తప్పింది. అప్పటికే కోతుల దాడిలో గాయాల పాలైన అతన్ని జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

టెండర్లు లేకుండా టేబుల్ ఎజెండా తీర్మానాలు

- బీఆర్‌ఎస్ కౌన్సిలర్ల నిరసన
- 20 నిమిషాలకే పరిమితమైన మున్సిపల్ సమావేశం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి

తూప్రాన్: టెండర్లు లేకుండా, తమకు చెప్పకుండానే టేబుల్ ఎజెండా తీర్మానాలు చేయడంపై ప్రతిపక్ష బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు నిరసన వ్యక్తం చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి అధ్యక్షతన శనివారం ఉదయం 11 గంటలకు జరగాల్సిన తూప్రాన్ మున్సిపల్ సాధారణ సమావేశం టేబుల్ ఏజెండా విషయంలో అధికార పార్టీ కౌన్సిలర్లు పలువురు అలకబునడంతో ఆలస్యంగా జరిగింది. దీంతో మధ్యాహ్నం 2 గంటలకు సాధారణ సమావేశం మొదలైంది. టేబుల్ ఎజెండాలోని కొన్ని పనులను తీర్మానించి, పలు తీర్మానాలను కౌన్సిల్ ఆమోదించింది. ఈ సమావేశం 20 నిమిషాలకే జరిగింది. మున్సిపల్ సమావేశం అనంతరం మున్సిపల్ మాజీ చైర్మన్ రాఘవేంద్రగౌడ్ మాట్లాడుతూ.. ఇష్టానుసారంగా ఇంటి పన్నులను పెంచి ప్రజల నుంచి బలవంతపు వసూళ్లకు పాల్పడుతూ సొమ్ము చేసుకుంటున్నారని అధికార పార్టీ కౌన్సిలర్లపై ఆరోపణలు చేశారు. పట్టణంలో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణం పనుల్లో నాణ్యత లేదని విమర్శించారు.